క్లుప్తంగా

4న యాగశాల ప్రతిష్ట

పాతపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్యదైవం పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఆలయంలో నూతనంగా నిర్మించిన యాగశాల (కుంకుమ పూజ మండపం) ఈ నెల 4వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ టి.వాసుదేవరావు మంగళవారం తెలిపారు. అనకాపల్లికి చెందిన యర్నాగుల అప్పలస్వామి, అనురాధ దంపతుల జ్ఞాపకార్థం సుమారు రూ.8 లక్షలతో యర్నాగుల మోహన్‌రావు కుటుంబ సభ్యులు యాగశాల నిర్మాణం చేపట్టారు. ప్రతిష్ట కార్యక్రమంలో భక్తులు పాల్గొని, ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ చైర్మన్ కోరారు.

సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగానికి ఎంపిక


వెంకట సాయికుమార్

పొందూరు: మండలంలోని తాడివలస గ్రామానికి చెందిన తమ్మినేని వెంకటసాయికుమార్ సెంట్రల్ బ్యాంక్ పీఓ ఉద్యోగానికి ఎంపికయ్యారు. సోమవారం ఫలితాలు ప్రకటించారు. సాయికుమార్ బీఎస్సీ అగ్రికల్చర్ (హానర్స్) పూర్తి చేశారు. సాయికుమార్ తండ్రి జగన్నాథరావు పొందూరు కోర్టులో ఉద్యోగి, తల్లి మనెమ్మ తాడివలస సర్పంచ్‌గా ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

సారవకోట: మండల పరిషత్ ఆవరణలో చలివేంద్రాన్ని ఎంపీడీఓ రాంబాబు మంగళవారం ప్రారంభించారు. ఉష్ణోగ్రత తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ఉన్నతాధికారులు సూచన మేరకు వివిధ అవసరాలపై మండల పరిషత్‌కు వచ్చేవారి కోసం ఈ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. ఈఓపీఆర్డీ రేణుక, మండల పరిషత్ సిబ్బంది ఉన్నారు.

365 మందికి వైద్య పరీక్షలు

సరుబుజ్జిలి: బూర్జ మండలంలోని డొంకలపర్తి గ్రామంలో మంగళవారం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. 365 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పలువురు వైద్యులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

పాతపట్నం: విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అంబేడ్కర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కె.ఆర్.రజినీ అన్నారు. పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు ఆధ్వర్యంలో ఫేర్‌వెల్ డేను మంగళవారం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ చక్రపతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సరిహద్దు గ్రామాల్లో నిఘా పెంచాలి


మాతల చెక్ పోస్టు వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న ఏఎస్పీ గంగాధర్

కొత్తూరు: ఆంధ్రా -ఒడిశా సరిహద్దు గ్రామాల్లో మద్యం, సారా, నగదు అక్రమ రవాణాపై నిఘా పెంచాలని జిల్లా అడిషినల్ ఎస్పీ (సెబ్) గంగాధర్ ఆదేశించారు. స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌ను మంగళవారం సందర్శించారు. ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలన్నారు. ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే నిబంధనల ప్రకారం చర్యలు తప్పవన్నారు. మాతల గ్రామం వద్ద ఏర్పాటు చేసిన అంతర రాష్ట్ర చెక్ పోస్టును పరిశీలించారు. స్థానిక సెబ్ సీఐ బి.జయరామిరెడ్డి, ఎస్‌ఐ శ్రావణి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్డన్ సెర్చ్


బైక్‌లను తనిఖీ చేస్తున్న సీఐ ప్రసాదరావు

నరసన్నపేట: స్థానిక పచూరీ కాలనీలో మంగళవారం ఉదయం నరసన్నపేట సీఐ బి.ప్రసాదరావు ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలో ఉన్న అన్ని ఇళ్లనూ పరిశీలించారు. ఇళ్లల్లో ఎవరెవరు ఉంటున్నారు.. ఎన్నాళ్ల నుంచి ఉంటున్నారు..కొత్తగా ఎవరైనా వచ్చారా.. అనేది అడిగి తెలుసుకున్నారు. కొత్తవారు ఎవరైనా వస్తే సమాచారం ఇవ్వాలని కాలనీ వాసులకు కోరారు. రానున్న ఎన్నికల సందర్భంగా ఎటువంటి వివాదాలకు దిగవద్దని సూచించారు. ఈ కార్డన్ సెర్చ్‌లో రికార్డుల్లేని నాలుగు ద్విచక్ర వాహనాలు గుర్తించామని సీఐ తెలిపారు. వాటి రికార్డులు తీసుకొని వస్తే వారికి తిరిగి అప్పగిస్తామన్నారు. నరసన్నపేట ఎస్‌ఐ అశోక్‌బాబు, పోలీసులు పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం

హిరమండలం: ఓటు వజ్రాయుధమని, ప్రతిఒక్కరూ ఓటు వేయాలని తహసీల్దార్ బి.సుధాకర్, ఏపీడీ పార్వతి, ఏపీఓ వి.శ్రీరామచంద్రమూర్తి అన్నారు. స్వీప్ ఆధ్వర్యంలో ఓటు చైతన్య కార్యక్రమాలను మంగళవారం హిరమండలం, లోకొండ, తంప, భగీరథిపురం కాలనీ, గొడియపాడు, మామిడిజోల గ్రామాల్లో నిర్వహించారు. మానవహారం, ర్యాలీలు చేపట్టారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. అధికారులను సహకరించాలని కోరారు. రెవెన్యూ, వెలుగు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


రూపురేఖలు మారిన రొట్టవలస

గ్రామ జనాభా	2,070 మంది	డీబీటీ ప్రయోజనం	రూ.10,10,33,949	నాన్ డీబీటీ ప్రయోజనం	రూ.1,52,92,502


విలేజ్ హెల్త్ క్లినిక్


గ్రామ సచివాలయం

- గ్రామంలోనే అన్ని రకాల ప్రభుత్వ సేవలు
- అభివృద్ధి పథంలో పల్లెలు




అవతరాబాద్‌లో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం

సరుబుజ్జిలి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత పల్లెల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ప్రతీ చిన్న అవసరాలకు మండల కేంద్రాలకు వెళ్లి రోజుల తరబడి కార్యాయాల చుట్టూ తిరిగే విధానానికి ఈ ప్రభుత్వం ఫుల్‌స్టాఫ్ పెట్టింది. సచివాలయం వ్యవస్థ ద్వారా పాలన గ్రామ స్థాయికి తెచ్చి అవినీతి రహిత విధానానికి నాంది పలికింది. దశాబ్దాల కాలంగా జరగని అభివృద్ధి ఈ ఐదేళ్ల కాలంలో జరిగింది. మండలంలోని రొట్టవలస సచివాలయం దీనికి ఉదాహరణ. ఈ సచివాలయం పరిధిలోని రొట్టవలస, అవతరాబాద్ గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి ఇలా..

- ఈ ఐదేళ్ల కాలంలో రొట్టవలస సచివాలయం పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీ పథకాల ద్వారా సుమారు రూ.12 కోట్ల ప్రయోజనాన్ని ప్రజలు పొందారు.
- రొట్టవలస గ్రామానికి మహిళా కళాశాల స్పీకర్ తమ్మినేని సీతారాం చొరవతో మంజూరైంది.
- రూ.95 లక్షలతో గ్రామ సచివాలయం, ఆర్బీకే, ఆరోగ్య కేంద్రం బల్క్ మిల్క్ కేంద్రం నిర్మాణాలు.
- రూ.20లక్షలతో అవతరాబాద్ జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా రక్షిత మంచినీటి పథకం నిర్మాణం.
- నాడు–నేడు ద్వారా హైస్కూల్, ప్రాథమిక పాఠశాల భవనాలను సుమారు రూ.1.25 కోట్లతో నిర్మించారు.
- ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా పంచాయతీలో రూ.25లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం.
- మండల పరిషత్ నిధులతో పాఠశాల ప్రహరీ, శ్మశానం, బోర్లు ఏర్పాటు.
- ఆర్అండ్‌బీ ద్వారా రొట్టవలసలో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం.
- అవతరాబాద్ కోనేరు, ముంగెన్న, నరసన్న కోనేరులను రూ.13లక్షలతో అభివృద్ధి, మెట్ల నిర్మాణం.
- చెరువుల చుట్టూ విద్యుదీకరణకు రూ.8లక్షలతో పోల్స్ ఏర్పాటు.


రైతు భరోసా కేంద్రం


బల్క్ మిల్క్ సెంటర్


అవతరాబాద్‌లో నిర్మించిన సీసీ రోడ్డు

కూన రవికుమార్‌వి అర్థంలేని ఆరోపణలు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సరుబుజ్జిలి: రాజ్యాంగ పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంపై మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్ దిగజారుడు విమర్శలు చేస్తే సహించేది లేదని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు హెచ్చరించారు. ఇటీవల స్పీకర్‌పై రవికుమార్ చేసిన వ్యాఖ్యల పట్ల మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ పోస్టుల కోసం డబ్బులు తీసుకున్నట్లు, భూముల ఆక్రమణకు పాల్పడినట్లు ఆరోపించిన రవికుమార్ ఆధారాలతో నిరూపించాలన్నారు. ఆరోపణలు చేసే ముందు తన నిజాయితీని నిరూపించుకోవాలని హితవు పలికారు. టీడీపీ హయాంలో ఇసుక ర్యాంపులు పేరిట కోట్లాది రూపాయలు రవికుమార్ కొల్లగొట్టారని ఆరోపించారు.

విశాఖపట్నం కప్పరాడ ప్రాంతంలో విలువైన స్థలాన్ని కబ్జా చేయడం నిజంకాదా అని ప్రశ్నించారు. వెన్నెలవలసలో 99 ఎకరాల ప్రభుత్వ భూమిని కూనవారి పూలతోట పేరుతో ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేయడం అందరికి తెలిసిందేనన్నారు. టీడీపీ హయంలో కూన చేసిన అభివృద్ధి, ఈ ఐదేళ్ల కాలంలో తమ్మినేని సీతారాం చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. వైస్ఎంపీపీ శివానందమూర్తి, పార్టీ కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, జేసీఎస్ కన్వీనర్ అత్తులూరి రవికాంత్, పేడాడ చిరంజీవి, బాన్న రాము పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


రూ.లక్ష చెక్‌ను అందజేస్తున్న దృశ్యం

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న భగవాన్ సత్యసాయి మందిరం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కాశీబుగ్గకు చెందిన పట్టపగలు విశ్వనాథం రూ.లక్ష చెక్కు విరాళంగా అందజేశారని సత్యసాయి మందిరం సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎన్ని లింగరాజు మంగళవారం తెలియజేశారు. నిత్యాన్నదానం పథకం విస్తరణలో భాగంగా ఇటీవల పాతపట్నం సీహెచ్‌సీ ఆస్పత్రిలో సేవలు అందిస్తున్నామన్నారు. సేవా సమితి కన్వీనర్ నాగులపల్లి శ్రీను, ఎరుకొల కృష్ణారావు, చిన్నారావు, శాసనపూరి మధుబాబు, వాడవలస రామారావు, భక్తులు పాల్గొన్నారు.

సంక్షేమానికి చిరునామా సీఎం జగన్


డోలలో ప్రచారం నిర్వహిస్తున్న డీసీసీబీ చైర్మన్ రాజేశ్వరరావు, రామలింగంనాయుడు


సంతలక్ష్మీపురంలో ప్రచారం నిర్వహిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య

పోలాకి: సంక్షేమానికి చిరునామా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జోనల్ ఇన్‌చార్జి, జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. డోల, సంతలక్ష్మీపురం, సన్యాసిరాజుపేట గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నరసన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా ధర్మాన కృష్ణదాస్, శ్రీకాకుళం ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు, యువజన విభాగం నాయకుడు ధర్మాన రామలింగంనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, పార్టీ నాయకులు డోల ఉదయ్‌భాస్కర్, వై.వి.రమణ, సూరపు జయరాంనాయుడు, పాగోటి తాతబాబు, రెంటికోట త్రినాథరావు, భావన వైకుంఠరావు, తూలుగు అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్ల రాజీనామా


హిరమండలం: రాజీనామా లేఖలతో వలంటీర్లు


ఎల్.ఎన్.పేట: రాజీనామా చేసిన గ్రామ వలంటీర్లు


జలుమూరు: సచివాలయ కార్యదర్శులకు రాజీనామా లేఖలు అందిస్తున్న వలంటీర్లు

ఎల్.ఎన్.పేట/జలుమూరు/హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలంలోని గొట్టిపల్లి గ్రామ సచివాలయం పరిధిలో అదే గ్రామానికి చెందిన గ్రామ వలంటీర్లు మంగళవారం తమ ఉద్యోగాలకు స్వచ్ఛందగా రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎల్.వి.వి.కామేశ్వరరావుకు అందజేశారు. జలుమూరు మండలం టెక్కలిపాడు సచివాలయం పరిధి వలంటీర్లు వెలమల గౌరుబాబు, యలమంచిలి రాంబాబు తమ రాజీనామా పత్రాలను కార్యదర్శులు కె.లలిత, ఎస్.ఝాన్సీకి అందజేశారు. హిరమండలం మండల కేంద్రానికి చెందిన వలంటీర్లు సైలాడ నందిని, పొర్లంగి రాజేశ్వరి, సాకిపల్లి రమ్య, జోగి రోహిణి, పీతా కల్పన, సనత్ పాణిగ్రహి, తామాడ శంకర్, వాకాడ ఉష, గంట ఆమని స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను మేజర్ పంచాయతీ ఈఓకు అందజేశారు. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో పనిచేస్తున్న తమపై చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు గత నాలుగేళ్లుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారి తప్పుడు ప్రచారం తిప్పి కొట్టేందుకు జగనన్న సైనికుల్లా పనిచేస్తామని, వచ్చే ఎన్నికల్లోనూ జగనన్నను మరోసారి గెలిపిస్తామన్నారు. చంద్రబాబు కూటమి గెలిస్తే అవ్వాతాతలకు ఇచ్చే పింఛన్లు కూడా ఆపేస్తారన్నారు. కూటమి కుటిల రాజకీయాలు ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాజీనామా చేసిన వారిలో ధర్మాన నాగేశ్వరి, శిమ్మ జనార్దనరావు, పొన్నాన బాలాంబిక, కూన అప్పన్న తదితరులు ఉన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు


మెళియాపుట్టి: వసుంధరలో అవగాహన కల్పిస్తున్న సీఐ సాయి


కొత్తూరు: ఎన్నికల నియమావళిని వివరిస్తున్న సీఐ వేణుగోపాలరావు

మెళియాపుట్టి: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని పాతపట్నం సీఐ నల్లి సాయి అన్నారు. మండలంలోని వసుంధర గ్రామంలో ఎన్నికల కోడ్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. సోషల్ మీడియా, ఇతరత్రా మాధ్యమాల్లో, డైరెక్ట్‌గా అయినా ఒకరినొకరు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, దుష్ప్రచారాలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పించొద్దన్నారు. ఎస్సై రాజేష్, సిబ్బంది ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్పించొద్దు..

కొత్తూరు: ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు తప్పవని స్థానిక సీఐ ఆర్.వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని వసప గ్రామంలో మంగళవారం గ్రామస్తులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో శాంతియుత వాతవరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. ఎస్‌ఐ ఎం.ఎ.అహమ్మద్, వీఆర్వో గిరీష్ కుమార్ పట్నాయక్, హెచ్‌సీ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే అజెండా


నరసన్నపేట: రెల్లివలసలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్


ఆమదాలవలస: ప్రచారం నిర్వహిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి
- ఎన్నికల ప్రచారానికి గ్రామాల్లో అపూర్వ స్పందన


ఆమదాలవలస రూరల్: అక్కులపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న చిరంజీవినాగ్


పొందూరు: వృద్ధురాలికి అభివాదం చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం


మెళియాపుట్టి: గొప్పిలిలో కూరగాయల వ్యాపారులతో మాట్లాడుతున్న రెడ్డి శ్రావణ్

అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్‌సీపీ అజెండా అని స్పీకర్ తమ్మినేని సీతారాం, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఆమదాలవలస మున్సిపాల్టీ పరిధిలోని 13వ వార్డు కొత్తకోటవారి వీధి, చంద్రయ్యపేట తదితర ప్రాంతాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పొందూరు మండలం అచ్చిపోలవలసలో స్పీకర్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. నరసన్నపేట మండలం తెలగవలస సచివాలయం పరిధిలోని రెల్లివలస, పారశెల్లి, తెలగవలస గ్రామాల్లో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, ధర్మాన రామలింగన్నాయుడు ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని దిగువ కంద్రవీధి, ఎస్సీ వీధి, గణేష్ నగర్‌లో ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేపట్టారు. ఈ ఐదేళ్ల పాలనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలతో లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కలిగిందన్నారు. ఆమదాలవలస మండలంలో అక్కులపేటలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మెళియాపుట్టి మండలం గొప్పిలిలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి తనయుడు శ్రావణ్ గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కూరగాయల వ్యాపారులతో మాట్లాడి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. కొత్తూరు మండల కేంద్రంలోని పడాల వీధి, గాజుల వీధి, కుమ్మరి వీధి, రెల్లి వీధి, కుమ్మరి వీధి కాలనీలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి తనయుడు ఓం శ్రీకృష్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


పాతపట్నం: ఎస్సీ వీధిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి


కొత్తూరు: పడాల వీధిలో ప్రచారం నిర్వహిస్తున్న రెడ్డి ఓం శ్రీకృష్ణ

యాంత్రీకరణపై యువ రైతులకు అవగాహన


కృషి విజ్ఞాన కేంద్రంలో యాంత్రీకరణపై యువ రైతులకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

ఆమదాలవలస: యాంత్రీకరణతో సేద్యం చేస్తే ఖర్చు ఆదా అవుతుందని కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆత్మ సౌజన్యంతో వ్యవసాయ యాంత్రీకరణపై శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యంగా వరిసాగులో యాంత్రీకరణ, ఇతర పంటల్లో యాంత్రీకరణ గురించి యువ రైతులకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. సస్య సేద్య శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ కుమార్ నేల తయారీ యంత్రాలు, విత్తనాలు, ఎరువు ఒకేసారి వేసే యంత్రాల గురించి వివరించారు. అగ్రికల్చరల్ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరావు వ్యవసాయంలో కష్టం హైరింగ్ సెంటర్స్ యొక్క సాధకబాధకాలను వివరించారు. నాట్లు వేసే యంత్రం గురించి విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.నీలవేణి చెప్పారు. డ్రోన్ సాయంతో వ్యవసాయ మందుల పిచికారీని సస్య రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.అనూష చేసి చూపించారు.

కవి సమ్మేళనానికి కుప్పిలికి ఆహ్వానం

ఆమదాలవలస: మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఉగాది సందర్భంగా నిర్వహించే కవి సమ్మేళనంలో పాల్గొనేందుకు తనకు ఆహ్వానం అందిందని ఆమదాలవలసకు చెందిన కవి కుప్పిలి వెంకటరాజారావుకు మంగళవారం తెలిపారు. ఈ నెల 5వ తేదీన చెన్నై యూనివర్సిటీలో జరిగే సాహిత్య సదస్సుకు దేశ వ్యాప్తంగా 60 మంది కవులకు ఆహ్వానం పంపారన్నారు. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి తనకు తెలుగు విభాగం నిర్వాహకులు ఎం.శంకరరావు ఆహ్వానం పంపారన్నారు. ప్రముఖ సినీ గీత రచయిత భువన చంద్ర కవి సమ్మేళనంలో పాల్గొంటారన్నారు.